క్లుప్తంగా

సీఆర్ రెడ్డికి ప్రజా డాక్టర్‌గా గుర్తింపు


సీఆర్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు: డివిజన్‌లో సీఆర్ రెడ్డి ప్రజా డాక్టర్‌గా గుర్తింపు పొందారని ఆయన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరులోని డాక్టర్ సీఆర్ రెడ్డి నివాసంలో గురువారం ఆయన కుటుంబ సభ్యులను మేరిగ మురళీధర్ పరామర్శించారు. సీఆర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట డాక్టర్లు రోహిణి, జనార్దన్‌రెడ్డి, నాయకులు సుధీర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

పీఏసీఎస్‌లో గృహ రుణాలు

సైదాపురం: సహకార సంఘాల ద్వారా గృహ రుణాలను అందజేయనున్నట్లు గూడూరు సెంట్రల్ బ్యాంకు మేనేజర్ సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు డివిజన్ పరిధిలో సహకార సంఘాల ద్వారా రైతులకు రూ.125 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. రైతులకు సహకార సంఘాల ద్వారా గృహ నిర్మాణాలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలను ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే విద్య రుణం కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ గోగినేని శివ కుమార్, సీఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గూడూరు: పోస్టల్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తమ డిమాండ్ల సాధన కోసం గూడూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సుధాకర్‌రాజు, శ్రావణ్‌కుమార్, రమణయ్య పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణ

చిట్టమూరు: మండలంలోని పిట్టివానిపల్లె సమీపంలో పులికాలువపై కల్వర్టు నిర్మాణానికి గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మల్లాం రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మల్లాం సచివాలయంలో ఆర్డీఓ రైతులతో సమావేశం నిర్వహించారు. మల్లాం ఎగువన ఉన్న పిట్టివానిపల్లెలోని భూముల్లో వాకాడు మండలం ముట్టెంబాక గ్రామస్తులు రొయ్యలు సాగు చేస్తున్నారు. చెరువుల్లో కలుషిత నీరు పులికాలువ ద్వారా మల్లాం చెరువులోకి వెళ్లడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో రైతులు లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ క్రమంలో రొయ్యలు గుంతల కలుషిత నీరు మల్లాం చెరువులోకి పోకుండా పులికాలువపై కల్వర్టు నిర్మించి నీటిని మళ్లింపుపై ఆర్డీఓ రైతుల అభిప్రాయాలను సేకరించారు. వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు దువ్వూరు శేషురెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

సేవాభావం అలవరుచుకోవాలి

వెంకటగిరి: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరుచుకోవాలని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్స్‌పల్ డి సుజాత తెలిపారు. స్థానిక ఏకలవ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు గురువారం డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ పాదుపు సొమ్ముతో 20 జతల చెప్పులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం వెంకటసుబ్బయ్య, మంజునాథ్‌రెడ్డి, అధ్యాపకులు జి యుగంధర్, పి రేవతిరెడ్డి, ఎం పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పోలిరెడ్డిపాళెంలో డెంగీ


పోలిరెడ్డిపాళెంలో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన బాలుడు బీ హర్షవర్ధన్(17)కు డెంగీ పాజిటివ్ వచ్చిందని స్థానిక వైద్యాధికారి చైతన్య గురువారం తెలిపారు. దీంతో డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పోలిరెడ్డిపాళెంలో ఇంటింటికి వెళ్లి ఫివర్, దోమ లార్వా సర్వే చేపట్టారు. గ్రామంలో క్లోరినేషన్ వంటి పనులు చేశారు. ఈకార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్‌బాబు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు


పేకాట రాయుళ్ల అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సీఐ ప్రసాద్, పోలీసులు

నాయుడుపేటటౌన్: మండలంలోని పుదూరు సమీపంలో పేకాట స్థావరంపై ఎస్ఈబీ సీఐ ఆర్‌యూపీఎస్ ప్రసాద్ సారథ్యంలో పోలీసులు మఫ్టీలో గురువారం దాడి చేశారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న పుదూరు గ్రామానికి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8400 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి, పోలీసులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ ఈబీ కానిస్టేబుళ్లు రాజయ్య, తిరుమల రావు, శ్రీరాములు పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయం వైపు 'సాగు'తున్నారు!

సంప్రదాయ పంటలకు నీటి కొరత.. గిట్టుబాటు, దిగుబడి లేమి.. తెగుళ్లు.. వెరసి అన్నదాతలకు కష్టం.. నష్టం.. మూడేళ్లుగా మారిన పరిస్థితులు.. అందుబాటులో శాస్త్రవేత్తలు.. భూసార పరీక్ష కేంద్రాలు.. ఆర్బీకేల రాక.. ఫలితంగా పుడమి పుత్రులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. అధిక దిగుబడి.. లాభాల పంట పండిస్తున్నారు.


దొరవారిసత్రం మండలం తనియేలి వద్ద సాగు చేసిన పత్తి

సూళ్లూరుపేట: రైతులు సంప్రదాయ పంటల సాగును వీడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడంపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మూడు, నాలుగేళ్లుగా పత్తిపంట సాగుపై మొగ్గు చూపుతున్నారు. సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా వరి, వేరుశనగ, సజ్జ, రాగి, మిరప పంటలు పండించే వారు. రైతులు ఇటీవల కాలంలో కొత్తగా పత్తిపంట సాగుపై మోజు చూపుతున్నారు. సూళ్లూరుపేట మండలం, దొరవారిసత్రం, తడ మండలాల్లోని నాదెళ్లవారికండ్రిగ, మంగళంపాడు, కొన్నెంబట్టు, మావిళ్లపాడు, తనియేలి, బూదూరు, కాదలూరు, వెండ్లూరుపాడు తదితర గ్రామాల్లో రెండు మూడేళ్లుగా పత్తి సాగు చేస్తున్నారు. వరి, వేరుశనగ పంటల్లో నష్టాల వస్తుండడంతో ఆరుతడి పంటల వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మూడు మండలాల్లో సుమారు వందమంది రైతులు దాదాపు వెయ్యి ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. వరి సాగు చేస్తే నీళ్లు అందడం లేదని, నీరు తక్కువగా తీసుకునే పత్తి సాగు చేస్తున్నారు. ఇందులో దిగుబడులు పరవాలేదనిపించడంతో సాగు చేయడానికి ఒకరిని చూసి మరొకరు సాగు విస్తీర్ణాన్ని ఏటా పెంచుతున్నారు. రాష్ట్రంలో ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోనే కాకుండా తెలంగాణా రాష్ట్రంలో కూడా పత్తి ఎక్కువగా సాగు చేస్తుంటారు. అక్కడి నుంచి విత్తనాలు తీసుకొచ్చి ఇక్కడ సాగు చేస్తుండడంతో పంట పరవాలేదనిపిస్తోందని రైతులు అంటున్నారు. నీరు తక్కువైనపుడు ఈ పంట వేయడం ఉత్తమమని రైతులు చెబుతున్నారు. మొత్తానికి వరిసాగుతోనే ఏరువాక సాగించే రైతులు నెమ్మదిగా కొత్తరకం పంటలవైపు దృష్టి సారిస్తున్నారు. పత్తి పంటే కాకుండా అక్కడక్కడ రైతులు మొక్కజొన్న, ఉల్లి, మిరప, బాసుమతి రైస్ లాంటి పంటలు సాగు చేస్తున్నారు. తీర ప్రాంత గ్రామాలైన పేర్నాడు, తోటకట్ల ప్రాంతాల్లో కాకర కాయ, బెండకాయ, వంగ తోటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు గ్రామాలకు కలిపి ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీంతో ఒకప్పుడు ఎలాంటి పంటలు సాగు చేయాలన్న విషయం, భూసార పరీక్షలు చేసుకోవాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి మారి, గ్రామంలోనే వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, భూసార పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు ఆ మేరకు కొత్త పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ఖర్చు తక్కువ.. అధిక లాభం



ఈ ప్రాంతంలో వరి పండే పొలాల్లో సైతం పత్తి సాగు వైపు మొగ్గు చూపుతున్నాం. పత్తి సాగు తక్కువ పెట్టుబడితో అధిక లాభం వస్తోంది. కిలో పత్తి రూ.70 నుంచి రూ.75 ధర వరకు ఉంది. ఎకరా పత్తి సాగుకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు ఖర్చు అవుతుంది. బాగా దిగుబడి వస్తే ఎకరాకు రెండు టన్నులు పత్తి దిగుబడి వస్తుంది. **-చెన్నూరు రమణారెడ్డి, రైతు, తనియాలి గ్రామం**

అర్హులందరికీ భూ పంపిణీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు

చిట్టమూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకూ భూ పంపిణీ చేస్తామని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో భూ పంపిణీకి సంబంధించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే భూ పంపిణీపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సమావేశం ఏర్పాటు చేసి, రైతులు తాము సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిపై ఎటువంటి అభ్యంతరాలు లేకుంటే వారికి ఆ భూమిని పంపిణీ చేస్తామన్నారు. ఒక వేళ ప్రభుత్వ పొలం లేకుంటే సెంటు భూమి లేని నిరుపేదలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి పట్టా భూమిని కొనుగోలు చేసి భూ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు చిట్టమూరు మండలంలో 130 మంది రైతులకు తాము సాగు చేసుకుంటున్న భూమి 50.30 ఎకరాలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దువ్వూరు శేషురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చిప్పల వెంకటయ్య, మల్లాం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ చిల్లకూరు సాయి కుమార్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంకా రమణయ్య, మెట్టు శ్రీహరిరెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, గజేంద్రరెడ్డి, షేక్ రెహ్మాన్, ఎర్రబోతు మణి పాల్గొన్నారు.

బాబురెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

మల్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ కార్యదర్శి చెన్నారెడ్డి బాబురెడ్డిని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. బాబురెడ్డి తండ్రి ఆదిపరెడ్డి కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. గురువారం జరిగిన ఉత్తరక్రియలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హాజరై, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు చిట్టమూరు గ్రామానికి చెందిన ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ మేరిగల మధుయాదవ్‌ను పరామర్శించారు. మధుయాదవ్ తండ్రి కస్తూరయ్య ఇటీవల మృతి చెందాడు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చిప్పల వెంకటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు వంకా రమణయ్య, బురదగల్లి రాజారెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, గజేంద్రరెడ్డి, విజయులు రెడ్డి, షేక్ రెహ్మాన్, ఎర్రబోతు మణి పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే సంక్షేమం


మీజూరులో లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాతనే అర్హత ఉన్న ప్రతి పేదవాడికి, కుటుంబానికి వివిధ రకాల సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం మీజూరు, తొగరాముడి, బేరిజంగాలపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన పథకాల గురించి వివరించి, బుక్‌లెట్‌ను అందజేశారు. అంతేకాకుండా ప్రజల నుంచి ఎదురైన ప్రతి సమస్యపై దృష్టి పెట్టి కొన్ని సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించేలా ఆయన చర్యలు చేపట్టారు. మీజూరు, బేరిజంగాపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే మీజూరులోని ఎస్సీ కాలనీవాసులకు శ్మశానానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన కలెక్టర్‌లో మాట్లాడి శ్మశానానికి రోడ్డు నిర్మాణం కోసం రూ.3 లక్షలు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయలేని పనులు, సంక్షేమ పథకాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసి చూపారన్నారు. ఈకార్యక్రమంలో చెంగాళ్లమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ ప్రసాద్‌నాయుడు, నాయకులు రామకృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, రామయ్య, బాలరాజు, శేఖర్, మునస్వామినాయుడు, బాబు రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'పల్లెబాట' ప్రారంభం


పల్లెబాటలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

వాకాడు: మండలంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పల్లెబాట కార్యక్రమం ప్రారంభించారు. వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కాశీపురంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీనాథ్, ఎంఈఓ బాబు, డీటీ సారంగపాణి, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, ఏఎంసీ చైర్ పర్సన్ వాకాటి నాగభూషణమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు అజిత్‌కుమార్‌రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు: వేసవిలో చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలిని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎల్‌హెచ్‌ఎంఎస్ లాక్‌హౌస్ మానిటరింగ్ సిస్టం పరికరాల పనితీరుపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చాలా మంది బంధువుల ఇళ్లకు, విహార యాత్రలకు వెళుతున్న క్రమంలో ఇళ్లలో చోరీలు జరగకుండా ఈ సిస్టం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైన చోరీకి ప్రయత్నిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో తెలుస్తుందన్నారు. సమావేశంలో సీఐలు హజరత్‌బాబు, దశరథరామారావు, ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాత సామాన్ల దుకాణంలో అగ్ని ప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పీవీఎస్ ఆస్పత్రి సమీపంలో పాత సామానుల దుకాణంలో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. బాధితుడు సెల్వం కథనం మేరకు.. పట్టణానికి చెందిన సెల్వం పాత సామాను కొనుగోలు దుకాణం నిర్వహిస్తున్నాడు. యజమాని సెల్వం మధ్యాహ్నం వరకు దుకాణంలో ఉండి, భోజనానికి ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి దుకాణంలో అట్టల నిల్వ ఉన్న చోట మంటలు ఎగిసిపడుతుండడంతో వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. దుకాణంలో దేవుడి చిత్రపటాల ఎదుట పెట్టిన దీపం పడి, ఈ ప్రమాదం జరిగినట్లుగా అగ్నిమాపక సిబ్బంది అనుమానిస్తున్నారు. సుమారు రూ.30 వేలకు పైగా విలువ చేసే అట్టలు ఇతర సామాగ్రి కాలిపోయినట్లు బాధితుతు సెల్వం వాపోయాడు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గూడూరు రూరల్: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. గూడూరు రూరల్‌లోని ఆదిశంకర కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కూలీలు జాతీయ రహదారి పనులు ముగించుకుని ట్రాక్టర్‌లో వెళుతుండగా నెల్లూరు వైపు వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో హనుమంతయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఘటనపై ఎలాంటి సమాచారం అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

నాయుడుపేటలో ఒకరికి..

నాయుడుపేటటౌన్: మండలంలోని చలివేంద్రం గ్రామం వద్ద రహదారిపై గురువారం రాత్రి కారును బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన మస్తాన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కథనం మేరకు.. మేనకూరు వైపు నుంచి నాయుడుపేటకు వస్తున్న కారును నాయుడుపేట వైపు నుంచి మేనకూరు వెళుతున్న బైక్ అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న సూళ్లూరుపేటకు చెందిన మస్తాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

పనులు వేగవంతం చేయండి

కోట: పాఠశాలల్లో నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ భవానీ సూచించారు. గురువారం హెచ్‌ఎంలు, సచివాలయ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో నాడు–నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 29 పాఠశాలలో నాడు–నేడు పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉందన్నారు. నిధులున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వేసవి సెలవుల్లో పనులు వేగవతంతం చేసి, జూన్ 12 నాటికి పూర్తయ్యేలా చూడాలన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

వాకాడు: మండలంలోని కల్లూరులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో 0.5 సెంట్ల ప్రభుత్వ భూమిని గ్రామంలోని నలుగురు కలసి తన ఇంటి నివేశ స్థలంలో కలుపుకుని వాడుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నరసింహరావు, పోలీసులు జోక్యం చేసుకుని ఆక్రమణదారులకు నచ్చజెప్పి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సర్వేయర్ సరెండర్

చిల్లకూరు: విధి నిర్వహణలో అలసత్వం పాటిస్తున్నారని చిల్లకూరు మండల సర్వేయర్ మల్లికార్జున్‌ను బుధవారం రాత్రి గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ కలెక్టరేట్‌కు సరెండర్ చేసినట్లు గురువారం తహసీల్దార్ అజ్మతుల్లాకాన్ తెలిపారు.

ప్రభుత్వ స్థలాలను వినియోగంలోకి తెస్తాం

కోట: పంచాయతీ అభివృద్ధిలో భాగంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వినియోగంలోకి తెస్తామని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. కోట అభివృద్ధిపై గురువారం రెవెన్యూ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ అరుణకుమారి, ఎంపీడీఓ భవానీ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

చిల్లకూరు: తాము కొనుగోలు చేసిన 24 ఎకరాల భూమికి అడంగల్, 1బీ చేయించుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే దానికి కొంత మంది అడ్డంకులు సృష్టిస్తున్నారని వరగలికి చెందిన రైతు కాల్తి రెడ్డి సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసిల్దార్ అజ్మతుల్లాఖాన్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తనకు ఆ భూమిపై హక్కులు లేవని కొందరు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో తనకు ఒన్‌బీ, అడంగల్ మంజూరు కాలేదన్నారు. స్పందించిన తహసిల్దార్ మాట్లాడుతూ భూ సమస్యపై క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

సరస్వతి విగ్రహ ప్రతిష్ట

దొరవారిసత్రం: అక్కరపాక ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం సరస్వతి విగ్రహం ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన ఎం మల్రెయ్య సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకుందాం

గూడూరు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులైన జ్యోతిరావ్‌పూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌ను స్మరించుకుందామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ ప్రాంతంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను గురువారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే సమ సమాజస్థాపన ఏర్పాటవుతుందని పూలే దంపతులు అందరికీ విద్యనందించేందుకు కృషి చేశారన్నారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం, శ్రీనివాసరావు, భాస్కర్, వెంకటరమణయ్య, గోపాల్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: నిరుపేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అన్నారు. సైదాపురం మండలం గులించెర్ల సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు నేదురుమల్లికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, బుక్‌లెట్‌లు అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని, అవినీతికి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించడంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ప్రథమ స్థానంలో నిలిపారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్మన్ పొట్టేళ్ల శిరీషాయాదవ్, నేతలు ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌రాజు, గోగినేని శివకుమార్, మాలకొండారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సత్వరసేవలు అందించాలి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

వెంకటగిరి:సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వసేవలను సత్వరం అందించాలని కమిషనర్ బీవీ రామయ్య తెలిపారు. గురువారం 14వ వార్డు పరిధిలోని సచివాలయాన్ని ఆ వార్డు కౌన్సిలర్ ఏ శంకరయ్యతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు దోహదపడాలని సూచించారు. అనంతరం స్థానికంగా నిరుపయోగంగా ఉన్న మినరల్‌వాటర్ ప్లాంట్‌లను పరిశీలించి మరమ్మతులకు నివేదికలు తయారు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం


మాట్లాడుతున్న పానాసోనిక్ జీఎం సెంథిల్‌కుమార్

తడ: మండలంలోని రామాపురం కుప్పం ప్రాథమిక పాఠశాల అభివృద్ధితోపాటు విద్యార్థులకు అవసరమైన పలు వస్తువులను తడ పానాసోనిక్ పరిశ్రమ వారు సమకూర్చారు. ఇందుకు సంబంధించి గురువారం ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమంలో పరిశ్రమ జీఎం సెంథిల్ కుమార్ చేతుల మీదుగా పాఠశాలకు వాటిని అందజేశారు. సెంథిల్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యావ్యాప్తికి తమ వంతు సహకారం ఎప్పుడూ అందిస్తామని తెలిపారు. పాఠశాలకు అవసరమైన కాంపౌండ్ వాల్, ఫ్లోరింగ్ టైల్స్, పాఠశాలకు పెయింటింగ్ తోపాటు విద్యార్థులకు అవసరమైన 15 డెస్కులు, 4 టేబుళ్లు అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసన్, హెచ్‌ఎం నాగవేణి, ఇతర పాఠశాలల హెచ్‌ఎంలు కామేశ్వరరావు, ఉస్మాన్ బాషా, సీఆర్‌పీ గోపీనాథ్ పాల్గొన్నారు.

పోరాటాలకే పరిమితం కాదు

వెంకటగిరి: సీఐటీయూ కేవలం కార్మిక పోరాటాలకే పరిమితం కాదని, రైతాంగ సమస్యలతోపాటు వ్యవస్థ మార్పు పోరాడే కార్మిక సంస్థ సీఐటీయూ అని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి బాలసుబ్రమణ్యం తెలిపారు. స్థానిక ఆర్‌వీఎం ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఆ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె మురళి, పట్టణ అధ్యక్షుడు విజయభాస్కర్, ఏపీపీ కేజే ప్రకృతికుమార్, పట్టణ కార్యదర్శి మంజుల, నేతలు స్వరూపరాణి, భాస్కర్, మస్తానయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.